# ఆన్‌లైన్ పెళ్లి




ఫోన్ మోగుతూనే ఉంది. పట్నంలో ప్రజలకు కూడా ఎప్పుడో తెల్లవారిపోయింది. రిటైరయి ఇంట కూర్చున్న నాకు మాత్రం ఇంకా బద్ధకం గానే ఉంది. పై పెత్తందార్లను మెప్పించడానికో, పదవిని పదిలంగా కాపాడుకోవడం కోసమో సరైన నిద్రకూడా పోకుండా తెల్లవారక ముందే భయం భయంగా గాబరా గాబరాగా లేచిన రోజులు కాలగమనంలో కలిసిపోయాయి. ఇప్పుడైనా ప్రశాంతంగా నిద్రపోకపోతే ఎలా అని నా సిద్ధాంతం. ఆయుర్దాయం ఇంకా పెంచేసుకొని పెళ్ళాం పిల్లలతో అగచాట్లు పడడానికి తెల్లవారక ముందే లేచి మార్నింగ్ వాక్‌కి బయలుదేరే వాళ్లతో నేను జట్టు కట్టలేదు. నాకు తోచినప్పుడు నాకు నచ్చినట్టు చేసేదే నా ఎక్సర్‌సైజు.

రిటైర్‌మెంట్‌కి ముందు ఓ అయిదారు సంవత్సరాలు బడా ఆఫీసర్ హోదా వెలిగించడాన్న ఫోన్ ఎవరైనా అందుకొని నాకివ్వడం అలవాటయింది. ఇప్పుడా పని నా శ్రీమతి జానకి చేస్తుంది. ఏం చేస్తాం. మరి ఉన్నది మేమిద్దరమే. పిల్లలు ఎక్కడెక్కడో ఉద్యోగాలు.

ఫోన్ ఇంకా మోగుతూనే ఉంది. జానకి అందుబాటులో లేదు. తప్పనిసరయి ఫోన్ ఎత్తి ‘హలో’ అనకముందే చిన్ననాటి స్నేహితుడు ముకుందం “ఎంత అదృష్టవంతుడివిరా బాబూ ... చక్కని ఇల్లు, తెలివైన భార్య, పొద్దెక్కినా ఆదమరచి నిద్రపోగల ఆత్మశాంతి... అని సాగదీస్తూంటే సోది మానేసి చెప్పరా బాబూ” అన్నాను.

“తీరికగా మాట్లాడే సమయం నాకూ లేదులే. రేపు లేదు ఎల్లుండి ఆదివారం రాత్రి ఏడున్నర, ఎనిమిది మధ్య మా ఇంటికి మీ ఉభయులూ విందు భోజనానికి వస్తున్నారు. తప్పనిసరిగా రావాలి. సమయపాలన చాలా ముఖ్యం. ఎందుకు? ఎవరెవరు వస్తారు? అంటూ ప్రశ్న




గణపతిరాజు నరసింహరాజు

లతో సాధించక తప్పనిసరిగా ఇద్దరూ వచ్చే యండి. అన్ని ప్రశ్నలకూ సమాధానం ఆవేళ దొరుకుతుంది. ఫోన్‌లో పిలిచానని ఏమీ అను కోవద్దు" అంటూ ఫోన్ పెట్టేయబోయాడు.

"ఉండరాబాబూ. విషయం తెలియకపోతే ఈసారికి ఎగ్గొట్టేద్దామనుకుంటున్నాను" అన గానే

"ఆ పని చేయకునాయనా. మీ సిస్టర్... అదే మా ఆవిడ నా ప్రాణం తోడేస్తుంది. బుజ్జి గాడి పెళ్ళి ఆ రోజు" అంటూ ఫోన్ పెట్టేసాడు.

ముకుందానికి ఇద్దరమ్మాయిల తరువాత ఒక అబ్బాయి. వాడి అసలు పేరు నందగోపాల్. ముద్దు పేరు బుజ్జి. ముకుందం సంతానమంతా అమెరికాలోనే సెటిలయ్యింది. వాళ్లందరూ మంచి ఉద్యోగాలతో చక్కని ఇల్లు వాకిళ్లతో కళ కళలాడే గ్రీన్‌కార్డ్ హోదాలతో అమెరికాని ఆదు కుంటున్నారు. ముకుందం, అతని భార్య మాలి ని కూడా అక్కడే సెటిలయి ఉండేవారు కానీ ఇండియాలో వాళ్లు పెంచుకుని వస్తున్న ఆస్తులు కాపాడడానికి, పిల్లల గొప్పలు అంద రికీ చాటి చెప్పడానికీ తప్పనిసరయి ఉండి పోయేరు.

మాలిని ఎన్నో పూజలు, పునస్కారాలూ చేసింది. తీర్థయాత్రలు చేసింది. ఆఖరికి కోరిన కోరికలల్లా నెరవేర్చగలరన్నే నమ్మకం కుదిరిన ఓ గురువుగారు కూడా దొరికారు. ఇద్దరమ్మా యిల తర్వాత కొడుకు కావాలంది. కలిగేడు. వాడికి మంచి చదువు, అమెరికాలో ఉద్యోగం, అంతు తెలియని సంపద అన్నీ కోరుకున్నట్టే జరిగాయి. ఇప్పుడు ముద్దుల కొడుకు బుజ్జిగాడి పెళ్లి ఎలా జరగాలనుకున్నదో మరి.

అమెరికా వెళ్లిన అబ్బాయిల పెళ్లిళ్లు చూసి నేను వాటికి 'తత్కాల్ వివాహం' అని పేరు పెట్టేను. అనుకోకుండా ప్రయాణం చేయవలసి నపుడు 'తత్కాల్ రిజర్వేషన్' అని రైల్వేవారు సదుపాయం ఏర్పాటు చేసారు. కాస్త ఖర్చు ఎక్కువకాని ప్రయాణానికి సాధారణంగా ధోకా ఉండదు.

మధ్యాహ్నం విమానం దిగి సాయంత్రం పెళ్లి కూతురుని చూసి రాత్రికి ఏ గుడిలోనో పెళ్లి చేసుకొని మర్నాడు పెళ్లి కూతురుతో వినీ లాకాశంలో తేలిపోయి, అమెరికాలో దిగక ముందే ఇటైతే మద్రాస్‌లోనో అటైతే బొంబాయి లోనో శోభనం జరిపేసుకొనే శుభ వివాహన్ని 'తత్కాల్ వివాహం' అంటుంటాను నేను. అయి తే ఈమధ్య తత్కాల్ వివాహలకి ఆడపిల్ల తల్లి దండ్రులంతగా ఇష్టపడడం లేదని తెలుస్తోంది. తత్కాల్ వివాహాలు కాస్తా తాత్కాలిక వివాహాలు అవుతుండడమే కారణం.

బుజ్జి పెళ్లి ఎవరితో జరుగుతుంది, ఏ విధంగా జరుగుతుంది అని నేను ఆలోచించే లోపునే ఆదివారం వచ్చేసింది. అయినప్పటికీ వివాహ వివరాలు తెలియలేదు. నాకంటే హె చ్చు ఆత్రుత పడుతున్న జానకి రెండు మూడు సార్లు ఫోన్ చేసినా మాలిని ముద్దుల మనుమ రాలు అమెరికన్ యాసలో ఇంగ్లీష్‌లో ముందు గా రికార్డ్ చేసిన మాటలు "మీరు పిలిచినవారు ప్రస్తుతం అందుబాటులో లేరని చెప్పడానికి చింతిస్తున్నాం. దయచేసి కొంతసేపాగి మరలా ప్రయత్నించండి. లేదా మీ సందేశం 'బీప్' శబ్దం వినిపించి ఆగిన తరువాత తెలపండి" అంటూ వినిపించేది. మా ఆవిడ ఆతృతకి అదొ క పెద్ద బ్రేక్ కావడంతో విసుగుపుట్టి మరి ఫోన్ చేయడం మానేసింది.

సాయంత్రం ఏడు గంటలయ్యేప్పటికి ము కుందం ఇల్లు చేరాం. ఉద్యోగంలో ముకుందం బాగానే సంపాదించేడు. అందరూ మాత్రం అదృష్టమంతా మాలినిదేనంటారు. అమెరికా నుంచి అబ్బాయి పంపిస్తున్న డబ్బు దానికి తోడయింది. వాళ్లు కొన్న తోటలు, భూములు, ఇల్ల స్థలాలు కాకుండా పట్నంలో ఈ ఇల్లు

కూడా బాగానే కట్టించేడు. పెద్ద హాలు, అందు లోంచి మేడ మీదకు మెట్లు, పైన మూడు గదులు, బాల్కనీలు, ఆ పైన మరో సింగిల్ బెడ్ రూమ్, దిగువ హాలుకు అటుపక్క, ఇటుపక్క పెద్ద పెద్ద గదులు, పెరటిలోను, వీధిలోనూ పూల మొక్కలు, వీధిలో ఫౌంటెన్, పెరటిలో స్విమ్మింగ్‌పూల్, సర్వంట్ క్వార్టర్స్ ఉన్నాయి. మంచి అభిరుచి, సంపద గల వాళ్ల ఇల్లులా ఉంటుంది. గదుల్లో కూడా ఖరీదైన ఫర్నిచర్; షోకేసులలో అమెరికన్ బొమ్మలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, హోమ్ థియేటర్, దిగువ నొకటి, పై గదుల బాల్కనీలో ఒకటీ కంప్యూటర్ సిస్టమ్స్; రకరకాల టెలిఫోన్లు శోభాయ మానంగా ఉంది ఇల్లు.

'మందుంటే ముందుంటాం. లేకుంటే స్టేటు గవర్నరిచ్చినవిందైనా జారుకుంటాం' అన్న తరహాలో ఉండే మా మిత్ర బృందం ఒకరూఒకరూ వచ్చి హాలు ప్రక్క మరో గదిలో చేరుకుంటూ అక్కడి డిమ్‌లైట్లలో పలకరించు కుంటూ హుషారుగా ఉన్నారు. మాలిని గొప్పతనం అదే. అలాంటి పార్టీలకు అన్ని హంగులతో కూడిన గది ఆవిడ ఏర్పాటే. హాలుకి కుడివైపున్న విశాలమైన మరో గదిలో పిల్లలు చేరారు. అక్కడ రకరకాల గేమ్స్, పెద్ద పెద్ద బొమ్మలు, సౌండ్ సిస్టమ్స్ అన్నీ ఉన్నాయి. తలుపులు దగ్గరకు వేసేస్తే శబ్దం పైకి వినిపించని ఏర్పాటుంది. మధ్య విశాలమైన హాలులో మేం చతికిలబడ్డాం. ఎంతదూరాన ఉన్నా మాలిని మాటలు, నవ్వు తెలిసిపోతాయి. మధ్యమధ్య హాలులోకి వచ్చి స్వాగతం పలుకుతూ రెండుమూడు మాటలు చెబుతూ వెళ్ళిపోతోంది. మాలిని తెలుగు మాట్లాడడం చాలా తక్కువే.

ఆమె హుందాతనం, నవ్వు, మాటకారితనం, దర్పం ప్రదర్శించే కట్టు, బొట్టు తీరు ఎవరినైనా ఇట్టే ఆకట్టుకొంటాయి. కాకపోతే ఎదుటి వారిని మాటాడనివ్వకుండా అదే పనిగా తను, తన కుటుంబం గురించే చెప్పుకునే గొప్పలు చాలామంది భరించలేరు. అవసరానికి ఆదుకునే మంచి గుణం కూడా ఉండడాన్న ఆ లోపం కూడా అంతగా ఆమెకు అడ్డుకాలేదు. అల్లుళ్ల పుణ్యమా అని కూతుర్లు సంతానవతులౌతూంటే వియ్యాల వారి కంటే ముందు అమెరికాలో ఉండేది ఆమె. విమాన ప్రయాణం చేస్తే ఎయిర్ హోస్టస్‌లు, ఫ్లైటు బర్సరులు అందరూ స్నేహితులయిపోతారు. పైలట్ కేబిన్‌లోకి రానివ్వక గాని... లేకపోతే వాళ్లతో కూడా స్నేహం చేసేసేది. ఆవిడ అమెరికా గురించి మనకు చెబుతూంటే అమెరికా ప్రెసిడెంటు ప్రెస్ సెక్రటరీకయినా అన్ని విషయాలు తెలియవేమోనని పిస్తుంది.

ముకుందం మందు పార్టీలో చిక్కుకుపోయాడు. మరి ఆవేళటికి నాకు కన్పించకపోయినా ఆశ్చర్యం లేదు. మా ఇద్దరి మధ్యా అలాంటి అవగాహన ఎప్పటినుంచో ఉంది. మేం కూర్చున్న చోట మాటి మాటికీ వస్తున్న రకరకాల స్నేక్స్, కూల్‌డ్రింక్స్‌తో మేం కూడా సరదాగానే ఉన్నాం. క్రమక్రమంగా ఇక్కడ కూడా హడావుడి పెరిగింది. అన్నిచోట్లా అమెరికా వాతావరణం. అక్కడున్న వాళ్ల పిల్లలు, వాళ్ల తెలివితేటలు;సంపాదనలు; ఇండియాకి వాళ్ల వల్ల జరుగుతున్న మేలు; మేధావులకు మనదేశం చూపుతున్న మొండి చెయ్యి... ఎంచేతో నేనుగాని, జానకిగానీ మా చిన్నబ్బాయి అమెరికాలో ఉన్న విషయం, మేం రెండు సార్లు అమెరికా వెళ్లిరావడం, అవసరాన్ని మించి ప్రస్తావించడానికి పెద్దగా ఇష్టపడం. మా ఉత్కంఠ అంతా బుజ్జి ఎక్కడున్నాడు? వాడి-పెళ్లి ఎలా జరుగబోతుందనే విషయంపైనే.

ఇంతలో మాలిని వచ్చి "యువర్ ఎటెన్షన్ ప్లీజ్". అనగానే హాలంతా నిశ్శబ్దమయింది.

"మా ఒక్కగానొక్క అబ్బాయి బుజ్జి గురించి మీ కందరకీ తెలుసు. కొందరు వాడిని చిన్న పుడు చూసి ఉంటారు కూడా. మరికొద్ది సేపట్లో వాడి వివాహం జరుగబోతోంది... ఇక్కడ కాదు... స్టేట్స్‌లో మాకాబోయే కోడలు పేరు బిందు. గుజరాతీ అమ్మాయి. కంప్యూటర్ ప్రొఫెషనల్; గ్రీన్‌కార్డ్ హోల్డర్. ఎబౌఆల్ షీ ఈజ్ ఆల్‌రడీ ఎర్నింగ్ సిక్స్టీ కే" అంటూ మళ్లీ తెలుగు తర్జుమా చేసింది. "అంటే ఆ అమ్మాయి ఇప్పుడే సంవత్సరానికి అరవైవేలు అంటే నెలకు అయిదువేల డాలర్లు సంపాదిస్తోంది తెలుసా!" అక్కడితో ఆగలేదు. "వాళ్ల కుటుంబం అంతా ఏనాడో అమెరికాలో సెటిలయింది. బిందూ ఈజ్ వెరీ క్యూట్, చామింగ్ అండ్ స్మార్ట్‌గాల్... చాలా అందమైన చలాకీఅయిన పిల్ల. మావాడు ఏది ఎంచుకున్నా తిరుగుండదు తెలుసా. వాడి అంచనాలు ఎప్పుడూ తప్పలేదు".

"ఆరంభిస్తే మరి ఆగదు కదా! ఆ గొప్పలు చూడు జీవితంలో రెండు మొట్టికాయలు తింటే ఈ గొప్పలన్నీ గాలికెగిరిపోతాయ్" మా ప్రక్కనున్న ఆయన మెల్లగా భార్యతో అంటున్నాడు.

"ఇంతకీ చెప్పవలసినదేమిటంటే మా బుజ్జి... అదే మా నందగోపాల్, బిందూ కంప్యూటర్ చాటింగ్‌లో దగ్గరై, అభిరుచులు ఏకమయ్యాక కాన్ఫరెన్స్‌లలో కలుసుకొని ఒకరినొకరు అర్థం చేసుకున్నాక పెళ్లి చేసుకుందామనుకున్నారు. అటూ, ఇటూ పెద్దలకు తెలియజేసారు. ఈ రోజు ఉదయం వాళ్లు అక్కడ సీడీలో వస్తున్న వేదమంత్రాల సాక్షిగా దండలు మార్చుకొని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. మా హోమ్ థియేటర్‌లో మనం అదంతా చూసి తరువాత డిన్నర్ ఎంజాయ్ చేస్తాం. పెద్ద వాళ్లు కొందరు మా వెబ్ కెమెరా ముందుకు వచ్చి వాళ్లను ఆశీర్వదిస్తారు. ఇదీ ఇప్పుడు మన ప్రోగ్రామ్. పిల్చిన వారందరూ వచ్చినందుకు చాలా థేంక్స్".

ఆవిడ మాటలు పూర్తికాక ముందే సస్పెన్స్ తీరిపోయినందుకు ఊపిరి పీల్చుకొని అందరూ కబుర్లలో పడిపోయారు. ఆన్‌లైన్ పెళ్లి విందు అన్నమాట అని అర్థం చేసుకోగల వాళ్లు అనుకున్నారు. హాలులో లైట్లు మరింత డిమ్ అయ్యాయి. పక్క గదుల్లో వాళ్లు కొందరు మధ్య హాలులోకి వచ్చి కూర్చున్నారు. హోమ్ థియేటర్ తెరవైపు అందరి దృష్టీ మళ్లింది. ఉత్కంఠ పెరుగుతోంది. టీవి తెర రొద తప్ప బొమ్మలు రావడం లేదు. బుజ్జిది టైమంటే టైమ్ అన్న మన స్తత్వం అంచేత ఫోన్ చెయ్యక్కర్లేదనుకున్నారు ముకుందం, మాలిని. ఆత్రుతగా సిస్టమ్స్ అన్నీ చెక్ చేసారు. గడియారాల వైపు పదే పదే చూసారు. అప్పటికే ఆకలనిపించిన కొందరు ఫుడ్ కౌంటర్స్‌వైపు దారి తీయడం మొదలుపెట్టారు. పిల్లలు ఆడుకునే గదుల్లోకి వెళ్లిపోయారు.

మాలిని మరి ఆగలేక బుజ్జికి ఫోన్ చేసేసింది. బుజ్జి ఫోన్ ఎత్తగానే అందరూ ఆత్రతగా ఉన్నారని వెంటనే తెరమీదకు రమ్మని చెప్పింది. నందూ వెంటనే తెరమీద క్లోజప్‌లో కనపడి "సారీ! మామ్, డేడ్. సారీ గైస్". అని ఆవలించేడు. ఓ పెద్ద లాగూ వాడూను. వెంటనే టీ షర్ట్ వేసుకుని వచ్చాడు. వాడి వాలకం చూసి జరుగవలసిన కార్యక్రమం ఏదో జరిగిపోయే ఉంటుందనీ, పెళ్లికూతురు కెమెరా ముందుకు రావడానికి సిగ్గుపడుతోందనీ గుసగుసలు, ముసి ముసి నవ్వులు.

అమెరికన్ యాసలో అబ్బాయి అంటున్నాడు. "ఓకే! ఓకే! అసలు విషయమేమిటంటే బిందూ ఓ ఎసైన్‌మెంట్ మీద వాషింగ్టన్ వెళ్లింది. ప్రజంటేషన్ ఇవ్వాల్సి ఉంది. షీవిల్‌బి బేక్ బై ట్యూజ్‌డే. అంచేత చిన్న పోస్ట్‌పోన్ మెంట్. సారీ! ప్లీజ్ ఎంజాయ్ ద పార్టీ. బైయూ గైస్. బై డేడ్. కిసెస్ మామ్... ఒన్ మినిట్. ఒన్

మినిట్ ఐవిల్ ప్లే బిందూస్ రిగ్రెట్స్ ఆల్సో" అంటూ తెరనుంచి తప్పుకున్నాడు. ముందుగా రికార్డ్ చేసి ఉంచిన బిందూ పలకరింపు వేయడానికి.

కొద్ది సేపట్లో పెళ్లి కూతురు బిందూ తెర పైకి వచ్చింది. పెద్ద అలంకరణలేమీ లేవు. సాదా సీదాగానే ఉంది. వయసు పాతికేళ్ల పైనే ఉండొచ్చు. బుజ్జిగాడి నిద్ర మొహంలా కాకుండా ఫ్రెష్‌గా ఉంది. "హలో ఆంటీ! హలో అంకుల్! హలో ఎవ్వెరీబడీ. సారీ ఫర్ ద డిసెప్పాయింట్‌మెంట్. బై దిస్ టైమ్ ఐ విల్ బిజీ ప్రజంటింగ్ మై... సారీ! అవర్ ప్రోజెక్ట్ బి ఫోర్ గ్రేట్ పీపుల్ ఇన్ వాషింగ్టన్. ఇఫ్ వుయ్‌ఆర్ లక్కీ వుయ్‌నీడ్ నాట్ లుక్ బేక్ ఇన్‌లైఫ్. ప్లీజ్! ఆలాఫ్ యూ విష్ మీ గుడ్‌లక్. అంకుల్, ఆంటీ ప్లీజ్ డూ మేక్ ఏన్ ఎర్లీ ట్రిప్ టు స్టేట్స్. బై! బై!" అంటూ పూర్తి చేసింది.

వచ్చిన వాళ్లలో కొందరు ఇంగ్లీష్ సంభాషణలకి విసిగిపోతారేమోనని మాలిని తెలుగులో మాట్లాడింది. "అదండీసంగతి మా కోడలు పిల్ల అనుకోకుండా వాషింగ్టన్‌లో చాలా పెద్ద ప్రోజెక్ట్ ప్రయత్నాలు చేయడానికి వెళ్లింది. అదే ప్రజెంటేషన్ అంటే వాళ్ల అనుభవం గురించి చెప్పి, ఇదివరకు చేసిన ప్రోజెక్ట్‌లు ఎలా విజయవంతంగా చేసారో చెప్పి, ఇప్పుడు ఈ కొత్త ప్రోజెక్ట్ వాళ్లకే ఇస్తే ఎంత చురుకుగా ఎంత తొందరలో పూర్తి చేసి ఇవ్వగలరో చెప్పి ఆ పని తమకే ఇచ్చేటట్టు చేసుకోవడం. అది సాధిస్తే మంచి పేరు, బాగా డబ్బు వచ్చి తిరుగు లేని విధంగా జీవితంలో స్థిరపడవచ్చంటోంది. మనందరి ఆశీర్వాదం కోరుకుంటోంది. పిచ్చి పిల్ల. ఎంత అభిమానమో చూసారా. అత్త మామల్ని ఆహ్వానిస్తోంది. అదే మనదేశంలో పెళ్లికాబోతున్న ఆడపిల్లల కంత అణకువా? ఏమైనా గుజరాతీల పెంపకం తీరేవేరు" మాలిని తెలివితేటలు మాలో చాలామందికి అర్థమయిపోయాయి. వాళ్ల బ్బాయి తెలుగు వాడయ్యుండి గుజరాతీ అమ్మాయిని చేసుకుంటున్నాడని ఎవరూ కామెంట్ చేయకుండా ఉండడానికి ఆ ప్రయత్నం. ఆక్షేపించినా లెఖ్ఖ చెయ్యనిదే అయినా అదొకతత్వం.

"రండి... రండి... ఫ్రీగా మీకు నచ్చినవి భోంచేసి... ఫ్రూట్స్, సేలడ్స్, ఐస్‌క్రీమ్స్... ఏవీ వదిలివేయకండి. ప్లీజ్" అంది మర్యాదగా మాలిని.

అందరం భోజనాలకి బయలుదేరాం. అప్పటికే చేసేసినవాళ్లు సోఫాల్లో చతికిల బడుతున్నారు. మా ప్రక్కనవెళ్తున్న భార్యా భర్తలలో ఆవిడ అంటున్నది. "రాను మొర్రో అంటే గొప్పగా వర్ణించి తీసుకొచ్చారు. అంతా ఇంగ్లీష్ స్పీకింగే. ఒక్కక్షరం ముక్కనాకు అర్థం కాలేదు". వాళ్లాయన "ష్ గట్టిగా వాగకే తల్లీ! అందుకే ఆ దేశాల్లో తెలివితక్కువ పెళ్లాన్ని ఇంట్లో వదిలేసి మరెవరితోనో ఇలాంటి ఫంక్షన్స్‌కి వెళ్తారట" అంటున్నాడు. ఆయన మరె వరో కాదు ఎన్ని ప్రయత్నాలు చేసిన అమెరికా వెళ్లలేక అదృష్టం కలసిరాక ఎప్పుడూ బాధపడే మోహన్ అయి ఉంటాడనుకున్నాను. డిమ్‌లైట్ల వెలుతురులో వెళ్తుండడాన్న అతడు అవునో కాదో తేల్చుకోలేకపోయాను. "మారదు, మారదు. ఈ దేశం ఎప్పటికీ మారదు" అంటూ నసిగాడు అతను.

పక్కనున్న వాళ్లావిడ మెల్లగానే నసుగుతూ "మారుతుందండీ, మారుతుంది. ప్రపంచం అంతామారుతూంటే మన దేశం ఎందుకు మారదు. భర్త ఎవర్తినో విందు భోజనాలకి తీసుకు వెళ్తూంటే, భార్య మరెవరితోనో మరోచోట విందు వినోదాలకు వెళ్లే రోజులు వస్తవి. లేకపోతే ఏంటి మీ వాలకం? మగవాళ్లయితే తప్పుకాదా. ఆడవాళ్లు అదే పని చేస్తే తప్పా?" అని ప్రశ్నిస్తోంది. ●